కథ

-శివల (ముక్కవిల్లి) పద్మ

# ప్రేమిస్తే...

''ఒక వ్యక్తి గురించి పదే పదే ఆలోచించాలని మనస్సు కోరుకుంటుంటే ఆ ఆలోచనలు మనస్సుకి ఎంతో నచ్చుతూ ఉంటే దానికి కారణం ఏమిటమ్మా!''

కూతురి ప్రశ్నకి కొద్దిగా చకితురాలైంది ధాత్రి.

ఒకసారి పరిశీలనగా కూతుర్ని చూసింది.

పద్దెనిమిదేళ్ల నిండు యవ్వనం - ప్రపంచాన్నింకా పూర్తిగా చూడని అమాయకమైన కళ్లు. అప్పటికే చాలా తెలిసిపోయిందనుకునే ధీమా.

''నీ ఏజ్ సమాధానం చెప్పనా లేక నా వయస్సుని బట్టి సమాధానం చెప్పనా?''

''అడిగింది నిన్నే కనుక నీకన్పించినదే చెప్పు''

''మనస్సు వాస్తవాలని విస్మరించి ఓ మత్తులోకి జారుతోందని అర్థం'' అవునా అన్నట్టు చూసింది దీప్తి.

''ఎందుకడిగావు అలా?''

''బికాజ్ ఐ స్టార్టెడ్ లైకింగ్ సమ్‌బడీ'' నెమ్మదిగా చెప్పింది.

''నథింగ్ రాంగ్. మొదట్నుంచి చెప్పు''

''హిమేష్... మా సైన్స్ సర్ వాళ్ల కజిన్.. ఒకసారి కాలేజీలో చూశాను. యాడ్ ఏజెన్సీ రన్ చేస్తున్నాడు. ఐ మీన్ బిజినెస్ చేస్తున్నాడు. మొదటిసారి కలిసినప్పుడు మంచి వ్యక్తిత్వం అనిపించింది. మరి కాసేపు మాట్లాడాలనిపించింది. ఆ తర్వాత ఏదో ఒక పని మీద తరచూ కలవడం జరుగుతోంది. స్లోలీ ఒక రకమైన ఇంట్రెస్ట్ డెవలప్ అవుతోంది తన పట్ల'' నవ్వు దాచుకుంటూ తల్లిని చూసింది దీప్తి.

అంత హాయిగా తన ఫీలింగ్స్‌ని పంచుకుంటున్న కూతురిని కాస్త గర్వంగా చూసింది ధాత్రి.

అవును మరి... ఈ చిన్నారి మొక్క తను ఊపిరి, ప్రాణం పోసి, పెంచినది. తల్లిగా లాలిస్తూనే అదిలిస్తూనే స్నేహితురాలిగా వారి కన్నా చిన్నపిల్లగా మారి వారితో సమానంగా అల్లరి చేసింది. అమ్మే కాదు ఆప్తమిత్రురాలు కూడా అనే భావన సంతానంలో నాటింది.

''నువ్వేమనుకొంటున్నావు?'' ప్రశ్నించింది కూతుర్ని.

''పూర్తిగా అర్థం కావడం లేదు కానీ - అతన్ని ప్రేమిస్తున్నానని మాత్రం అనిపిస్తోంది''

కొద్ది క్షణాలు మౌనంగా ఉండిపోయింది ధాత్రి.

ఇటువంటి సమయాన్ని ఎప్పుడో ఒకప్పుడు ఎదుర్కోవలసి వస్తుందని తెలుసు. కాకపోతే జీవితాన్ని నాలుగురోడ్ల కూడలిలో ఉంచే వయస్సిది. తీసుకునే నిర్ణయాన్ని బట్టి - వేసే అడుగుని బట్టి గమ్యం నిర్దేశితమవుతుంది.


ఎందరో అమాయకపు కన్నెలు తప్పటడుగు వేసేవి ఇక్కడే. అలా అని వాస్తవం వినేందుకు వారు ఇష్టపడరు. మంచి కూడా చేదుగా అనిపించే వయస్సు కూడా ఇదే.

''మాట్లాడవేం అమ్మా!'' కూతురి ప్రశ్నతో తెప్పరిల్లింది.

''నీ ప్రశ్నకు సమాధానం రెండు విధాలుగా ఉంటుంది. నీకు నచ్చినది, నిజమైనది. దాని కన్నా ముందు నేనొకటి చెప్పదల్చుకున్నాను. నువ్వు కానీ అన్నయ్య కానీ ఎవరిని తీసుకొచ్చి పెళ్లి చేయమన్నా మేం చేస్తాం. మరో ఆప్షన్ లేదు కనుక. కనుక ఆ విషయంలో మీకు స్వేచ్ఛ ఉంది. అయితే నన్ను అభిప్రాయం అడిగావు కనుక నేను చెప్పాలి కనుక చెప్తాను. జీవితంలో మనిషికి ఓ సరి అయిన తోడు అవసరం. అదెలాంటి వారిని ఎంచుకుంటాం అనే విషయం మీదే జీవితం ఆధారపడి ఉంటుంది. ఆ విషయంలో వేసిన తప్పటడుగు వెనక్కి తీసుకునే అవకాశం లేదు. ఆ విధంగా నష్టపోయిన ఆడపిల్లల్ని అనేక మందిని నేను చూస్తూ ఉంటాను. జాలి వేస్తుంది. కానీ ఏం చేయను? వివాహం అనేది ఆడామగా ఇద్దరికీ అవసరమే. కానీ దాన్లో ఫెయిలైతే ఆ వైఫల్యపు ప్రభావం ఖచ్చితంగా ఆడదాని జీవితం మీద ఎక్కువ ఉంటుంది. మనం ఆధునికత గురించి ఎన్నో కబుర్లు చెప్పినా ఇది నిజం. ఇకపోతే ప్రేమ అన్నావు. కెన్ యు డిఫైన్ వాట్ ఈజ్ లవ్? ఈవెన్ ఐ కెనాట్. బరువులు బాధ్యతలు ఏమీ లేని వయస్సు హాయిగా, మనస్సు ఖాళీగా ఉంటుంది. ఆ సమయంలో తేలిగ్గా మనస్సులో చొరబడే ఒక ఎమోషన్ ప్రేమ అనే ఈ భావన! నిజానికి ఒక వ్యక్తి పట్ల మనకు మొదట కలిగేది ఆసక్తి. ఆపైన కారణం ఏదైనా ఉంటే ఇష్టం ఏర్పడుతుంది. ఈ రెండు భావాలనూ కలిపి దాన్ని ప్రేమ వైపు లాక్కెళ్లేది మనమే. ఎవరిని మనం ఇష్టపడినా వారిని గురించి ఆలోచించడం నచ్చుతుంది. అది సహజం''

''కానీ లైఫ్‌ని పంచుకోవాలనే ఆలోచన అందరి పట్లా రాదుగా'' మధ్యలో అడ్డుకుంది దీప్తి.

''నీ జీవితం చాలా విలువైనది. కేవలం నీ మనస్సులో కలిగిన ఇష్టం కారణంగా అవతలి వ్యక్తికి దాన్ని పంచుకునే అర్హత ఉంటుందా? రెండవది - నీ ఇష్టానికి కారణమైన విషయాలు జీవితం పంచుకునేందుకు తోడ్పడతాయా? ఉదాహరణకి ఈ రోజు సినీ హీరోలని, క్రికెటర్లని గాఢంగా ఆరాధించే ఆడపిల్లలు కోకొల్లలు. అలాగే గాయకులని కూడా. కానీ రేపు ఈ కారణం మీ దాంపత్యానికెంత తోడ్పడుతుంది? అని ఆలోచించాల్సిన అవసరం లేదా? జీవితాన్ని పంచుకోవడానికి కలిసి బ్రతకడానికి కావల్సింది ఓ ప్రత్యేకమైన ఆర్టో టాలెంటో కాదు. అవగాహన - సంయమనం - పరిణతి - బాధ్యత వంటి గుణాలు. ముఖ్యంగా నైతిక విలువల పట్ల కన్విక్షన్. దాంపత్యం పట్ల కమిట్‌మెంట్. ఆ వ్యక్తిలో ఈ గుణాలని పరిశీలించగల పరిణతి నేటి ఆడపిల్లల్లో ఉంటోందా? ముందు ఆ అబ్జర్వేషన్‌ని అలవర్చుకోవాలిరా నాన్నా! ప్రేమ కన్నా పెళ్లి కన్నా - ఎమోషన్స్ కన్నా ఎన్నో రెట్లు విలువైనది జీవితం. మిమ్మల్ని కన్నవారు కళ్లల్లో పెట్టుకుని పెంచుతారు. ప్రతిగా ప్రతి తల్లి తండ్రి పిల్లల నుంచి కోరుకునేది ఒకటే. వారు జీవితమంతా సుఖంగా ఉండాలని... ప్రేమ పేరుతో మీరు తప్పు నిర్ణయం తీసుకుని ఆ ఫలితాన్ని మీరు అనుభవిస్తుంటే మిమ్మల్ని చూసి కుమిలిపోయేది ఆ తల్లితండ్రులే. ఇంకెవ్వరూ మీ గురించి ఆలోచించరు. బాధపడరు. ఈ ప్రపంచంలో మీ గురించి వ్యధ చెందేది ఆ ఇద్దరే. ఇదంతా ఎందుకో తెలుసా?



ఈ ప్రేమ అనే ఉద్వేగానికి అనవసరమైన ప్రాధాన్యత ఇస్తున్న కారణంగానే. ప్రేమ పేరు పెట్టుకుని నువ్వొక వ్యక్తిని ఇష్టపడుతున్నావు. ఫైన్... వాట్ నెక్ట్స్? ఒంటరిగా కూర్చోవడమా? కలల్లో తేలిపోవడమా? ముసిముసి నవ్వులు నవ్వుకోవడమా? చేతిలో ఉన్న బాధ్యతను, కర్తవ్యాన్ని విస్మరించడవమా? కాలం చే జారాక నష్టాన్ని తలుచుకుని నిట్టూర్చడవమా?''

తల్లి గొంతులో ధ్వనించిన ఆవేశానికి విస్మితురాలైంది దీప్తి.

''అమ్మా! ఎందుకంత ఆవేశపడుతున్నావు?'' బెరుగ్గా అడిగింది.

''నా ఆవేశం, బాధ నువ్వు చెప్పిన విషయానికి కాదమ్మా! ప్రేమ పేరుతో సర్వం పోగొట్టుకుని కన్నవారికి కడుపుకోతను మిగిల్చిన ఆడపిల్లలు గుర్తుకొస్తే ఎంతో బాధగా ఉంటుంది. పదహారేళ్ల పాటు అపురూపంగా పెంచుకున్న ఆడపిల్ల ప్రేమ పేరుతో మోసపోవడమే కాకుండా ఆ మోసగాడి చేతుల్లో కిరాతకంగా నరకబడి ముక్కలుగా కళ్లెదుట కనిపిస్తే ఆ తల్లిదండ్రి అనుభవించే నరకం ఎలా ఉంటుందో మీరు క్షణం పాటైనా ఊహించగలరా. మీరు మళ్లీ తల్లులు అయితే తప్ప ఆ బాధ ఎలా ఉంటుందో అర్థం కాదు. మొన్ననే తిరుపతిలో జరగలేదా ఇది? ఇలా ఎందరో. మిమ్మల్ని ప్రేమించవద్దనలేదు. ప్రేమించిన వాడిని పెళ్లి చేసుకోవద్దని అనడం లేదు. కానీ ఇప్పుడు ప్రేమకి మీరిస్తున్న ప్రాధాన్యత ఉందే అది అంత అవసరం లేదు. వయస్సులో ఉన్న పిల్లలు గుర్తుంచుకోవలసిన అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే ప్రేమ జీవితంలో ఒక చిన్న భాగమే తప్ప అదే జీవితం కాదు. ప్రేమ కన్నా జీవితం ఎన్నో వేల రెట్లు విలువైనది. ప్రేమ అనేది ఒక ఉద్వేగం. కేవలం ఒక ఎమోషన్! జీవితం అనేది నూరుపాళ్లు వాస్తవం! పదహారో ఏట ప్రవేశించగానే (నేడు వస్తున్న సినిమాల పుణ్యమా అని టెంత్ క్లాసులోనూ సెవెంత్ క్లాస్‌లోనూ ప్రేమలు ప్రారంభం అవుతున్నాయి) ప్రేమ కోసం ప్రేమికుడి కోసం మనస్సు తలుపులు బార్లా తెరిచి ఉంచాల్సిన అవసరం లేదు. కానీ మీరదే చేస్తున్నారు. ఆ ఆరాటంలో ఇష్టాన్ని, ఆసక్తిని, స్నేహాన్ని, అన్నిటినీ ప్రేమ క్రింద మార్చేసుకున్నారు. నాలుగు రోజులు గడిచేసరికి ఆ భ్రమలు తొలగగానే విరక్తి పెంచుకుంటున్నారు''

''నీకు ప్రేమ నచ్చదా అమ్మా!''


''మీరు దేన్నయితే ప్రేమ అనుకుంటున్నారో అది నిజంగానే నచ్చదు. వయస్సులో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రేమించే హక్కుంది. నచ్చిన జీవిత భాగస్వామిని ఎన్నుకునే హక్కుంది. కానీ అంతకన్నా ముందు ఆ జీవితం తాలూకు విలువని అర్థం చేసుకోవలసిన బాధ్యత ఉంది. హక్కులే కాదు బాధ్యతలు కూడా అవసరం''


దీప్తి ఆలోచనలో పడింది. తల్లి మాటలు పదే పదే హృదయంలో ప్రతిధ్వనిస్తున్నాయి.

''ఇప్పుడేం చేయాలమ్మా!''

లాలనగా ఆమె చేయి పట్టుకుని తలని హృదయానికి ఆనించుకుంది ధాత్రి. మమకారం నింపుకున్న ఆమె వేళ్లు కూతురి తలను ఆప్యాయంగా నిమిరాయి.

''ఇది నీ ఒక్కదాని ప్రశ్న కాదు దీప్తీ! నీ స్థితిలో ఉన్న ఎందరో ఆడపిల్లల మనస్సులో




ఉదయించే ప్రశ్న! ఏం చేయాలని అడిగావు కదూ! మనిషిగా ఇంత ఉత్తమమైన జన్మ దొరికినందుకు జీవితానికో లక్ష్యం ఏర్పరుచుకోండి. అవి ఏదైనా కానివ్వండి. నీ వ్యక్తిత్వానికి నిండుదనాన్నిచ్చేది. వ్యక్తిగా నీకో గుర్తింపు నిచ్చేవి. ఒక్క లక్ష్యం జీవితానికి అవసరం. ఆ లక్ష్యం ఎంత ఉన్నతమైనదైతే అంత మానసిక బలాన్నిస్తుంది. అప్పుడు వ్యక్తిగత భావోద్వేగాలు, బలహీనతలు చాలా చిన్నవిగా కనిపిస్తాయి. అలాంటి లక్ష్యమూ గమ్యమూ ఏవీ లేని కారణంగానే నేటి యువతకు ప్రేమ చాలా ఉన్నతంగా గొప్పగా కనిపిస్తుంది. ఒకసారి నువ్వొక లక్ష్యాన్ని పెట్టుకున్నప్పుడు నీ ఫోకస్ అంతా దాని మీద ఉన్నప్పుడు - రేయీ పగలూ ఆ లక్ష్యసాధనే నీ ధ్యేయం అయినప్పుడే మిగతా ఏ విషయమైనా నీకు చిన్నదిగానే కనిపిస్తుంది. నీకు నచ్చిన ఒక లైన్ తీసుకో. చదువు, కళలు, వృత్తి, సమాజసేవ, ఏదైనా కానీ... నీ జీవితంలో నేనిది సాధించదలచుకున్నాను. నేను సాధించగలను అని ఒక నిర్ణయం తీసుకో. ఆ తర్వాత నీలో వచ్చే మార్పు నువ్వే అబ్జర్వ్ చేయి. ఆ దారిలో నువ్వు సాధించే ప్రతి చిన్న విజయమూ నీలో కొండంత ఆత్మవిశ్వాసాన్ని పెంచుతూ వస్తుంది. నీలో ఆత్మవిశ్వాసం పెరుగుతున్న కొలదీ తప్పులు చేసే అవకాశాలు తక్కువవుతాయి. ఆ స్వభావం సహజంగా నువ్వు సరైన నిర్ణయాలు చేసుకునేలా చేస్తుంది. ఇది నిజం..''

''అసలు ప్రేమించాలని ఎందుకు అనిపిస్తుంది? ప్రేమంటే ఏమిటి?'' సాలోచనగా అడిగింది దీప్తి.


''పరిణతి చెందిన హృదయంలో ప్రభవిస్తే అది ప్రాణశక్తి.. భ్రమలకు లోనై ఎండమావులను ఆశ్రయిస్తే అది విచ్చుకత్తి...''

''ఓ మైగాడ్! ఎంత కాంప్లికేటెడ్‌గా చెప్పావు''

''నిజం... ప్రేమ అనే భావన స్వచ్ఛమైనది అయితే నీలో జీవం పోయాలి. నిన్ను నిర్జీవం చేయకూడదు. బాధ్యత కలిగినది అయితే నిన్ను కర్తవ్యం వైపునడిపించాలి. నిన్ను నిర్వీర్యురాలిని చేయకూడదు. ప్రేరణ ఇవ్వగలిగినదైతే ఉన్నత శిఖరాలను అధిరోహింపచేయాలి. నిన్ను అధోగతికి దిగజార్చకూడదు. మనస్సుని తట్టగలిగితే నిన్ను మనిషిగా నిలబెట్టాలి. అంతే తప్ప రాక్షసుడిగా మార్చకూడదు.''

## అలా అనుకోకండేం!

**ఇటీవలే తన ప్రియుడు, పారిశ్రామికవేత్త సుజేష్‌ని వివాహమాడిన మాళవిక సినిమాలకు గుడ్‌బై చెప్పడం లేదంటోంది. పెళ్ళయిపోయింది కదాని తల్లి, చెల్లి వేషాల్లాంటివి ఒప్పుకోనంటోందామె. అలాంటి పాత్రలు పోషించేంతటి వయసు నేనేమీ మీరలేదు అని ఘంటాపథంగా చెప్పే మాళవిక- ఇంకా హీరోయిన్‌గానే నటిస్తానంటోంది. మరి ఆమెకి హీరోయిన్ వేషాలు ఇచ్చే నిర్మాతలు ఎంతమంది ఉంటారో వేచి చూడాల్సిందే!**



తల్లి ముఖాన్ని రెండు చేతుల్లో పట్టుకొని బుగ్గమీద ముద్దు పెట్టుకుంది దీప్తి. ఆపైన కొంటెగా అంది. ''ఈ రోజు సాయంత్రం హిమేష్‌ని కలవాలనుకుంటున్నాను''

''యు ఆర్ మోస్ట్ వెల్‌కమ్. ఇంత ఓపెన్‌గా నాతో నీ ఫీలింగ్స్ పంచుకున్నప్పుడే నాకర్థం అయింది. నా దీపూ డార్లింగ్ తొందరపడదని''

ముద్దుగా కూతురి ముక్కు పట్టుకుని ఊపింది ధాత్రి.

☆